## మూడో దశ ర్యాండమైజేషన్ పూర్తి

**భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల**



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం టౌన్, నవంబర్ 28: శాసనసభ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించే పీవో, ఏపీవో, ఓపీవోల కేటాయింపునకు మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల మంగళవారం తెలిపారు. ఐడీవోసీ మినీ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు కమల్ కిషోర్, హరికిషోర్, గణేష్ సమక్షంలో ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ప్రక్రియ పూర్తి చేశామన్నారు. జిల్లా పరిధిలో 965 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయించామన్నారు. ప్రక్రియలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ అధికారి, డీఈవో వెంకటేశ్వరాచారి, జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం అధికారి సుశీల్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ప్రసాద్, రంగప్రసాద్ పాల్గొన్నారు.

**నేడు పోలింగ్ మెటీరియల్ పంపిణీ..**

ఎన్నికల విధుల నియమితులైన సిబ్బంది, అధికారులకు బుధవారం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ అందిస్తామని కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. ఉదయం 6 గంటల కల్లా సిబ్బంది నియోజకవర్గ కేంద్రాల్లోని పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని, విధులకు నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**రేపు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి..**

ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లాపరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఇస్తున్నామని, ఇదే ప్రకారం ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికీ ఆయా యాజమాన్యాలు సెలవు ఇచ్చి వేతనం ఇవ్వాలని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల ఓ ప్రకటనలో ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ విద్యాలయాలకు ఎన్నికల సామగ్రిని చేరవేయాల్సి ఉన్నందున బుధవారమూ సెలవు ప్రకటించామన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

## నకిలీ బంగారంతో రూ.78 లక్షలు స్వాహా ?

**బ్యాంక్ అప్రైజర్ ఘనకార్యం ఇది..**

భద్రాచలం, నవంబర్ 28: నకిలీ బంగారాన్ని ఇతరుల ధ్రువపత్రాలతో ఓ బ్యాంక్ ఉద్యోగి తాను పనిచేస్తున్న బ్యాంక్‌లోనే తాకట్టు పెట్టి రూ.78 లక్షలు నగదు కాజేసినట్లు చేసినట్లు మంగళవారం భద్రాచలంలో ఓ వార్త చక్కర్లు కొట్టింది. తెలిసిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో అప్రైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా సుమారు 60 మంది ఖాతాదారుల ఆధార్‌కార్డు నకళ్లు, బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించాడు. వారి పేరుపై నకిలీ నగలను అదే బ్యాంక్ తాకట్టు పెట్టి రూ.78 లక్షలు కాజేశాడు. తాజాగా ఖాతాదారులకు తాకట్టు పెట్టిన బంగారంపై వడ్డీ, అసలు చెల్లించాలని లేదా రెన్యువల్ చేసుకోవాలని నోటీసులు అందడంతో మంగళవారం విషయం బయటకు వచ్చినట్లు సమాచారం. బ్యాంక్ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తున్నది. తదుపరి వివరాలు తెలియరావాల్సి ఉన్నది.

## క్వింటా గంజాయి పట్టివేత



పోలీసులకు పట్టుబడిన కారు, లారీ

పాల్వంచ, నవంబర్ 28: ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాదకు తరలుతున్న క్వింటా గంజాయిని మంగళవారం పాల్వంచ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాఘవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ నుంచి గంజాయి తరలుతున్నదని సమాచారం అందుకున్న పోలీసులు పట్టణంలోని కేటీపీఎస్ సీ కాలనీ గేటు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న కారును ఆపి సోదా చేస్తుండగా దానిలో ప్రయాణిస్తున్న వారు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తమ దైన శైలిలో విచారించగా లారీలో గంజాయి రవాణా చేస్తున్న విషయం బయటపడింది. ఈ క్రమంలో అటుగా వస్తున్న లారీని ఆపి సోదా చేసి పోలీసులు క్విటా గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన నరసింగరాజు, శ్రీకాంత్, హైదరాబాద్‌కు విజయ్‌కుమార్, రవి కుమార్‌గా గర్తించారు.

# ష..!

**అసెంబ్లీ ఎన్నికల ప్రచారం పరిసమాప్తం**

**రేపే పోలింగ్**



ఖమ్మం, నవంబర్27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రచారం ముగిసింది. ఎన్నికల బహిరంగ ఫలితాలు ముగియడంతో అభ్యర్థులు ఉన్న కొద్ది సమయంలోనే ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించేందుకు వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లో ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారం సాయంత్రం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు ఎక్కడికక్కడే ప్రచారాన్ని ముగించి వెనుదిరిగారు. సెప్టెంబర్ 21న బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటించగా ఆ తర్వాతి రోజు నుంచే గులాబీ ప్రచార పర్వం ప్రారంభమైంది. అక్టోబర్ 9న ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశాక ప్రచారం ఊపందుకున్నది. నవంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్ల ప్రక్రియ సాగింది. 15న ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించారు. 16 నుంచి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రచార మాత ప్రారంభించారు.

**చివరి రోజు ప్రచారం ఇలా..**

బీఆర్ఎస్ తరఫున పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలు, పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు బీఆర్ఎస్ నాయకుల్లో ఉత్సాహాన్ని నింపాయి. తర్వాత గులాబీ శ్రేణులు పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. మంగళవారం ఖమ్మం నగరంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఎంపీ నామా నాగేశ్వరరావు, నగర మేయర్ పునకొల్లు నీరజ రోడ్ షో నిర్వహించారు. పువ్వాడ తరఫున ఎన్నికల ప్రచారంలో కుమారుడు నయన్‌రాజు, సతీమణి వసంతలక్ష్మి, మమత మెడికల్ కళాశాల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, ఆమె కుమారుడు నరేన్ ఖమ్మంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధిరలో అభ్యర్థి లింగాల కమల్‌రాజుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రచారం నిర్వహించారు.

# అందరి చూపూ బీఆర్ఎస్ వైపే..

- సంక్షేమ పథకాలే తెలంగాణ ప్రభుత్వానికి శ్రీరామరక్ష
- కాంగ్రెస్ మాయ గ్యారెంటీలను ప్రజలు నమ్మడం లేదు
- బీఆర్ఎస్‌లో చేరికల కార్యక్రమంలో అభ్యర్థి రేగా


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు

సారపాక, నవంబర్ 28: అటు రాష్ట్రంలోనూ, ఇటు నియోజకవర్గంలోనూ అందరి చూపు బీఆర్ఎస్‌పైనే ఉందని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి రేగా కాంతారావు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే తెలంగాణ ప్రభుత్వానికి శ్రీరామరక్షగా నిలుస్తాయని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై మండలంలోని సారపాకలో కాంగ్రెస్‌కు చెందిన 60 కుటుంబాల వారు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిఒక్కరి చూపు బీఆర్ఎస్ వైపే ఉందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడేలా సీఎం కేసీఆర్ ఆ మ్యానిఫెస్టోను రూపొందించడంతో అనేక మంది ప్రజలు పార్టీలకు అతీతంగా బీఆర్ఎస్‌వైపు వస్తున్నారని అన్నారు. వచ్చే నెల 3 తరువాత ఏర్పడబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన మ్యానిఫెస్టోను అమలుచేస్తామని అన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.3 వేల గౌరవ భృతిని అందిస్తామని, రైతుబంధు సాయాన్ని పెంచుతామని, జనవరి నుంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని వివరించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీశ్, కొనకంచి శ్రీను, బాలి శ్రీహరి, సానికొమ్ము శంకర్‌రెడ్డి, చుక్కపల్లి బాలాజీ, బిట్రా సాయిబాబా, ఖాదర్, గుల్ మహ్మద్, బెజ్జంకి కనకాచారి, పూర్ణ, సోము లక్ష్మిచైతన్య రెడ్డి, కోటమర్తి వెంకటేశ్వర్లు, తిరుపతి ఏసోబు, బానోతు శ్రీను, లక్ష్మణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల కవాతు

మణుగూరు టౌన్, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రజలకు భరోసా కల్పించేందుకు మంగళవారం మణుగూరు పట్టణంలో సాయుధ బలగాల జవాన్లు కవాతు నిర్వహించారు. కవాతులో పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, సీఐ రమాకాంత్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఈబయ్యారం క్రాస్‌రోడ్డులో..**

పినపాక, నవంబర్ 27: ఈబయ్యారం పోలీసులు క్రాస్‌రోడ్‌లో మంగళవారం సీఆర్పీఎఫ్ జవాన్లు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు ఎక్కడా గుమిగూడొద్దన్నారు.



మణుగూరులో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

## లారీకి నిప్పు పెట్టిన మావోయిస్టులు


ఘటనా స్థలంలో దగ్ధమైన లారీ

చర్ల, నవంబర్ 28: ధాన్యం లోడుతో వస్తున్న ఓ లారీని మావోయిస్టులు దహనం చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. తెలిసిన వివరాల ప్రకారం.. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పూసుగుప్ప నుంచి చర్ల వైపు లారీ ధాన్యం లోడ్‌తో వస్తున్నది. లారీ వద్దిపేట సమీపంలోకి రాగానే మార్గమధ్యంలో 15 మంది మావోయిస్టులు లారీని అడ్డుకున్నారు. డ్రైవర్‌ను కిందికి దిగమని చెప్పి ధాన్యాన్ని అన్‌లోడ్ చేయించారు. అనంతరం లారీకి నిప్పు పెట్టి అక్కడి నుంచి ఉడాయించారు. ఘటనలో లారీ పూర్తిగా దగ్ధమైంది. లారీ యజమానికి చర్ల మండల కేంద్రానికి చెందిన ములగడ కిషోర్ అనే వ్యక్తి అని తెలిసింది. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకే ఈ చర్యకు పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

## రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

పాల్వంచ రూరల్, నవంబర్ 28: మండలంలోని జగన్నాథపురంలో ఈ నెల 18న పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి వ్యాన్‌లో తరలుతున్న 20 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. మంగళవారం నిందితుడు రావుల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు.